బాధితులకు న్యాయం జరగాలి: డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు టౌన్, డిసెంబర్ 7 : కేసుల విచారణలో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులకు మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సూచించారు. మణుగూరులో శనివారం జరిగిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసు అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, అశ్వాపురం సీఐ అశోక్, ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రాజ్‌కుమార్, కరకగూడెం ఎస్సై రాజేందర్, అశ్వాపురం ఎస్సై తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

బస్ షెల్టర్ ప్రారంభిస్తున్న ఏరియా జీఎం

రామవరం, డిసెంబర్ 7: సింగరేణి కొత్తగూడెం ఏరియా త్రీ ఇంక్లైన్‌లో మాతాశిశు ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా నిర్మించిన రిక్వెస్ట్ బస్ షెల్టర్‌ను జీఎం శాలెంరాజు శనివారం ప్రారంభించారు. కార్మిక నాయకులు మల్లికార్జున్‌రావు (ఏఐటీయూసీ),గౌస్, శేషశ్రీ (ఐఎన్‌టీయూసీ), ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 7: పాత కొత్తగూడెం అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ జితేష్ శనివారం సందర్శించారు. సోలార్ హీటర్లను ప్రారంభించారు. ఎంఈవో ప్రభుదయాళ్, జిల్లా అకడమిక్ కో-ఆర్డినేటర్ నాగరాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి కల్పనే ధ్యేయం : ఎమ్మెల్యే

బూర్గంపహాడ్, డిసెంబర్ 7: మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. తాళ్లగొమ్మూరు రైతువేదికలో శనివారం జరిగిన ఇందిర మహిళా శక్తి సంబరాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.6.77 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కులను తహసీల్దార్ ముజాహిద్, ఐకేపీ ఏపీఎం నాగార్జునతో కలిసి అందజేశారు. అనంతరం 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో జమలారెడ్డి పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 7: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం పర్యటించారు. అన్నపురెడ్డిపల్లి రైతు వేదికలో మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల చెక్కులు పంపిణీ చేశారు. సీఎం కప్ గ్రామ స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. కొందరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇచ్చారు తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీవో మహాలక్ష్మి, ఏపీఎం సంతోషకుమార్ పాల్గొన్నారు.

దుండగుల దుశ్చర్యతో ఎండిన మిర్చి

చండ్రుగొండ, డిసెంబర్ 7: మండలంలోని రావికంపాడు రైతు ఇమ్మడి శ్రీను, ఇటీవల తన మిరప తోటకు మందు పిచికారీ చేశాడు. అప్పటికే ఆయనకు తెలియకుండా ఆ మందులోని నీటిలో దుండగులు కలుపు మందు కలిపారు. దీంతో మూడు ఎకరాల తోట ఎండిపోయింది. ఈ సమాచారంతో ఆ తోటను బీఆర్ఎస్ మండల నాయకులు శనివారం పరిశీలించారు. పార్టీ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు, గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, నాయకులు కొణకండ్ల వెంకటరెడ్డి, మేడా మోహన్‌రావు, మద్దిరాల చిన్నిపిచ్చయ్య, గాలం రవి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే నిర్వాసితులు సహకరించాలి: ఆర్డీవో

చండ్రుగొండ, డిసెంబర్ 7: కొత్తగూడెం-సత్తుపల్లి రైల్వే లైన్ భూనిర్వాసితులు ప్రభుత్వానికి సహకరించాలని కొత్తగూడెం ఆర్డీవో మధు కోరారు. మండలంలోని జర్పులా తండా గ్రామంలోని భూనిర్వాసితులతో ఆయన శనివారం మాట్లాడారు. నష్ట పరిహారం తీసుకున్న కొందరు.. భూములను ఖాళీ చేయకపోవడంపై ఆరా తీశారు. నిర్వాసితుల జాబితా నుంచి కొందరి భూములను అధికారులు కావాలనే తప్పించారని ఆర్డీవోకు కొందరు ఫిర్యాదు చేశారు. దీనిని పరిశీలిస్తామని ఆర్డీవో చెప్పారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

దమ్మపేట, డిసెంబర్ 7: వెలమ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దమ్మపేటలోని వెలమ కులస్తులు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 'మీ అంతు చూస్తా.. ముఖ్యమంత్రికి తెలియకుండా ఒక్కొక్కరిని చంపుతా' అంటూ, తిట్టారని.. బెదిరించారని పేర్కొన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రావు జోగేశ్వరరావు, జలగం సుధాకర్, జలగం వాసు, వెలుగోటి ఉమామహేష్, ఎం.ప్రసాద్ ఉన్నారు.

మహిళా శక్తి భవనాలకు స్థల పరిశీలన

లక్ష్మీదేవిపల్లి, డిసెంబర్ 7: మహిళా శక్తి భవన సముదాయాల నిర్మాణానికి మండలంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్‌లో కేటాయించిన స్థలాన్ని శనివారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. అంచనా వివరాలను జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ శ్రీనివాసరావు నుంచి తెలుసుకున్నారు. పంచాయతీరాజ్ ఏఈ శివలాల్ పాల్గొన్నారు.

'నవభారత్'లో క్రీడాసంబురం

పాల్వంచ, డిసెంబర్ 7: పట్టణంలోని నవభారత్ పబ్లిక్ స్కూల్ 45వ వార్షిక క్రీడా సంబురాన్ని ఎస్పీ రోహిత్‌రాజు ప్రారంభించారు. అతిథులుగా నవభారత్ లిమిటెడ్ జీఎం కేఆర్‌వీ శ్యాంసుందర్, ఏజీఎం ప్రసాద్ వచ్చారు. ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాస రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బావమరిదిని ఎయిర్ గన్‌తో కాల్చిన బావ

పాల్వంచ, డిసెంబర్ 7: పాత పాల్వంచకు చెందిన ఎస్‌కే సిరాజ్ అహ్మద్‌పై అతడి బావ షేక్ జిలాని ఎయిర్ గన్‌తో కాల్చాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాత పాల్వంచకు చెందిన నజ్మాకు, తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామస్తుడు జిలానీతో 2016లో వివాహమైంది. గొడవల కారణంగా వీరు రెండేళ్ల క్రితం విడిపోయారు. అప్పటి నుంచి ఆమె అదే గ్రామంలో హోటల్ నడుపుతున్నది. కాపురానికి రావాలంటూ ఆమె వద్దకు జిలానీ తరచూ వెళ్లి గొడవ చేస్తున్నాడు. ఇవి ఇటీవల తీవ్రమవడంతో ఆమెను అన్న సిరాజ్, రెండు నెలల క్రితం పాత పాల్వంచలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడకు కూడా జిలానీ వెళ్లి, తన భార్యను పంపాలంటూ గొడవ చేయసాగాడు. అతడు ఇటీవల సిరాజ్ ఇంటికి వెళ్లి, అతడి కాళ్లపై ఎయిర్ గన్‌తో కాల్చి పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదుతో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★Looking for 1-4 yrs. Sales and Marketing Experience profiles in Paints Industry. Working across AP & TS. VG Paintings Industry. Cantact: 9494998833.
NT-326903_All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆటో కార్మికుల బంద్‌కు బీఆర్ఎస్ మద్దతు

దుమ్ముగూడెం: ఆటో కార్మికులకు మద్దతు పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

బూర్గంపహాడ్: మండలంలో బంద్ పాటిస్తున్న ఆటోలు

దుమ్ముగూడెం, డిసెంబర్ 7: రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికులు చేస్తున్న బంద్‌కు దుమ్ముగూడెం మండలంలో బీఆర్ఎస్ నేతలు శనివారం మద్దతు పలికారు. తూరుబాకలో ఆటో కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా మండల బీఆర్ఎస్ కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ ఎండీ జానీపాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో కార్మికుల కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయాలని, మహిళలకు ఉచిత బస్సులతో ఆటో కార్మికులు కిరాయిలు దొరక్క పస్తులు ఉండాల్సిన పరిస్థితి కుటుంబాల్లో ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఆటో కార్మికులకు జీవనోపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దామెర్ల శ్రీనివాస్, వాగే కృష్ణ, జిలకర గంగరాజు, ఆటో యూనియన్ నాయకులు కొమరం లింగరాజు, అజీమ్, డేగల చంటి, జల్లారపు రమేష్, మట్టా జోగయ్య, జలగం కొల్లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, పసుపులేటి రవి పాల్గొన్నారు.

బూర్గంపహాడ్ మండలంలో..

బూర్గంపహాడ్, డిసెంబర్ 7 : బూర్గంపహాడ్, సారపాక, ఇరవెండి, లక్ష్మీపురం, మోరంపల్లిబంజర్ తదితర అడ్డాల యూనియన్ల బాధ్యులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీ బస్సులు అమలుచేయడంతో ఆటోవాలాలకు కిరాయిలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో యూనియన్ల అధ్యక్షులు సాధిక్‌పాషా, శ్రీను, సాంబ, మహంకాళి వెంకటేశ్వర్లు, పడాల నాగరాజు, వెంకన్న, పవన్, జాని, నర్సింహారావు, సయ్యద్ టిప్పు సుల్తాన్‌లతో పాటు ఆటో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మ్యూజియం అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

– ఐటీడీఏ పీవో రాహుల్

మట్టి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

భద్రాచలం, డిసెంబర్ 7 : గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా మ్యూజియం అభివృద్ధి పనులను నెలాఖరు నాటికి పూర్తి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శనివారం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కుటీరాలు, పిల్లల క్రీడాస్థలం, బోటింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గిరిజన కళాకృతులతో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు ప్రత్యేకంగా హాలు ఏర్పాటు చేయాలని, మ్యూజియం చూసేందుకు వచ్చే జనాలకు వివిధరకాల ఆహార పదార్థాల అమ్మకాలు జరుపుకోవడానికి స్టాల్స్ ఏర్పాటు చేయాలని, మ్యూజియం వెనుక వెదురు ప్లాంటేషన్ నిర్మాణం, పాతకాలపు వేటాడే వస్తువులు, ఆర్చరీ, ఇతర వస్తువులు చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజియం ఎంట్రన్స్ నుంచి విద్యుత్‌లైట్లు అమర్చి అందంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఎఫ్‌డీసీ ఉదయ్‌కుమార్, డీఈ హరీష్, పంచాయతీ ఈవో శ్రీనివాస్, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, స్టాల్స్ ఏర్పాటు చేసే డిజైనర్లు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాలి

తడి, పొడిచెత్తను వేరుగా సేకరించి కొత్తగా నిర్మించిన డంపింగ్‌యార్డులో వేసేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. భద్రాచలం పట్టణంలోని మనుబోతుల చెరువు వద్ద కొత్తగా నిర్మించిన డంపింగ్‌యార్డును శనివారం ఆయన పరిశీలించారు. భద్రాచలం రాముడి ఆలయానికి ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వస్తుంటారని, ఎప్పుడూ పట్టణం పరిశుభ్రంగా ఉండాలని ఆ బాధ్యత పంచాయతీ అధికారులదేనన్నారు. డంపింగ్‌యార్డులో తరలించిన చెత్తను రీసైక్లింగ్ చేయాలని, తడిచెత్త ట్రెఫర్‌లో వేసి ఎండబెట్టి పౌడర్ చేసి వంటచెరుకుకు ఉపయోగించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ముక్కోటి దగ్గర ఉండడంతో పంచాయతీ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకు ముందే తల్లిని నరికేశారు

ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టుల ఘాతుకం

మావోయిస్టుల లేఖ

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 7: ఓ మహిళను ఆమె కుమారుడి ముందే మావోయిస్టులు తల నరికి చంపేశారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీ పదం, అంగన్‌వాడీ సహాయకురాలిగా పనిచేస్తున్నది. ఆమె ఇంట్లోకి శుక్రవారం అర్ధరాత్రి మావోయిస్టులు సాధారణ దుస్తుల్లో చొరబడ్డారు. కుమారుడి ముందే, ఆమెను తల నరికి చంపారు. ఆమె 2022 నుంచి పోలీస్ ఇన్ఫార్మర్‌గా పనిచేస్తున్నదని ఆరోపిస్తూ పార్టీ మద్దేడ్ ఏరియా కమిటీ పేరుతో లేఖను ఉంచారు. అక్కడకు శనివారం ఉదయం పోలీసులు చేరుకున్నారు. ఆమె కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

అమ్మ కోప్పడిందని.. బాలిక బలవన్మరణం

అశ్వారావుపేట, డిసెంబర్ 7: ఆ బాలికను ఓ చిన్న విషయంలో తల్లి కోప్పడింది. దీనిని తట్టుకోలేని ఆ బాలిక, క్షణికావేశంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక దండాబత్తుల బజారుకు చెందిన సామినేని రాజేశ్వరి సాయి(16), ప్రయివేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. శనివారం ఉదయం కళాశాలకు వెళ్లేటప్పుడు లంచ్ బాక్సులో కూర విషయంలో తల్లి వరలక్ష్మితో గొడవ పడింది. బిడ్డను ఆ తల్లి కోప్పడింది. ఆ తర్వాత, తమ కిరాణా దుకాణాన్ని తెరిచేందుకు తండ్రి, కూరగాయలు తెచ్చేందుకు తల్లి బయటకు వెళ్లారు. తల్లి తిరిగొచ్చేసరికి, ఉరికి విగతురాలిగా వేలాడుతున్న వరలక్ష్మి కనిపించింది. ఆ తల్లి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి, ఉరిని తొలగించి ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆ ఇంటిని ఎస్సై యయాతిరాజు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. తండ్రి వెంకన్న ఫిర్యాదుతో కేసును ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాసమస్యలను ప్రస్తావిస్తా: కూనంనేని

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 7: ఈ నెల 9 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల సమస్యలను ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 7: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అధికారులు పేర్కొన్నారు. వివిధ మండలాల్లోని పలు పాఠశాలల్లో శనివారం నిర్వహించిన సీఎం కప్ పోటీలను ఆయా మండలాల అధికారులు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో యువత ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.

సైలెంట్‌గా 'పీసా గ్రామసభ'

- 'మమ' అనిపించేలా డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక
- రెవెన్యూ అధికారుల తీరుపై మండిపడిన నిరుపేదలు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

భద్రాచలం, డిసెంబర్ 7: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో రెవెన్యూ అధికారులు నిబంధనలను గాలికి వదిలి గ్రామసభ నిర్వహించి 'మమ' అనిపించారు. పీసా చట్టానికి విరుద్ధంగా రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించి లబ్ధిదారుల ఎంపికలో నిర్లక్ష్యం చేశారని ప్రజలు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళనకు దిగారు. భద్రాచలంలో గ్రామసభ ఉందనే విషయమే తెలియపర్చకుండా సభ ఏర్పాటు చేసి అనర్హులను ఎంపిక చేశారని నిరుపేదలు మండిపడ్డారు. ఈ విషయమై ఉన్నతాధికారులతోపాటు ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. గ్రామసభ ఏర్పాటు చేసిన విషయం ప్రజలకు ఆలస్యంగా తెలియడంతో వారు అక్కడకు చేరుకునే లోగానే టెంట్లు, ఇతర సామగ్రిని రిక్షాలో తీసుకువెళ్లడం కనిపించింది.

అధికారుల తీరు బాగోలేదు..

నిరుపేదలమైనా మాకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశపడ్డాం. అధికారులు ఇలా గుట్టుచప్పుడు కాకుండా గ్రామసభ నిర్వహించి మా కలలను కల్ల చేయడం సబబుకాదు.

–రజనీకుమారి, గృహిణి, భద్రాచలం

ఈ గ్రామసభ పీసా నిబంధనలకు విరుద్ధం

మీడియాకు, ఆదివాసీ సంఘాలకు, పార్టీలకు, ప్రజలకు సమాచారం లేకుండా గ్రామసభ నిర్వహించడం పీసా చట్టం నిబంధనలకు విరుద్ధం. ప్రజలు, ఆయా సంఘాల ఆమోదం లేకుండా గ్రామసభ ఎలా నిర్వహిస్తారు?

–రాజుపర్మ, ఆదివాసీ నాయకుడు, భద్రాచలం

సంక్షిప్తం

రేపు ఈజీఎస్ ఓపెన్ ఫోరం

దమ్మపేట రూరల్, డిసెంబర్ 7: ఉపాది హామీ పథకం(ఈజీఎస్) ఓపెన్ ఫోరం ఈ నెల 9న ఉంటుందని ఎంపీడీవో రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 31 పంచాయతీల్లో 01 మార్చి 2023 నుంచి 31 మార్చి 2024 వరకు జరిగిన ఈజీఎస్ పనుల వ్యయంపై సామాజిక తనిఖీలు ఆదివారంతో ముగుస్తాయని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 7: మండలంలోని అబ్బుగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుంపెన సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావు శనివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించాలన్నారు.

14 వరకు మెగా లోక్ అదాలత్

టేకులపల్లి, డిసెంబర్ 7: ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు ఇల్లెందు కోర్టులో మెగా లోక్ అదాలత్ ఉంటుందని ఎస్సై పోగుల సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

రగ్గులు, దుప్పట్లు అందజేత

పాల్వంచ/ పాల్వంచ రూరల్, డిసెంబర్ 7: పాల్వంచలోని పెద్దమ్మ గుడి, బస్టాండ్ సెంటర్, సీ కాలనీ గేట్ తదితర ప్రాంతాల్లోని నిరాశ్రయులకు రగ్గులు, దుప్పట్లు, వాటర్ బాటిళ్లను నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్ శనివారం అందించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జలగం పరామర్శ

పాల్వంచ, డిసెంబర్ 7: వివిధ కారణాలతో ఇటీవల మృతిచెందిన పాల్వంచలోని తెలంగాణ ఉద్యమకారులు ముద్దంగుల శ్రీనివాస్, పొదిల సూరిబాబు, ఎడెల్లి శ్రీనివాస్, సయ్యద్ జకీఉల్లాహ్ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు శనివారం పరామర్శించారు. నాయకులు మసూద్, మంజూర్ ఆలీ, కేసరి రవీందర్, ఇజ్జగాని రవిగౌడ్, శ్రీపాద సత్యనారాయణ, చెన్నమల్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

రామవరం, డిసెంబర్ 7: మండలంలోని ధన్బాద్ పంచాయతీ సెయింట్ జోసెఫ్ హైస్కూల్ ఆవరణలో వివిధ రకాల మొక్కలను ఆరోతరగతి విద్యార్థులు నాటారు. ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌పీఎల్ చాణక్య అభినయ, జీపీఎల్ స్వేచ్ఛ పరిమళ, ఎకో క్లబ్ సెక్రటరీ శివశ్రుతి, అసిస్టెంట్ సెక్రటరీ ఇవాన్ ప్రఖ్యాత్, టీచర్లు నాగమణి, శోభ, ఉమామహేశ్వరి, నీరజ, రూప, రోజ్‌లిన్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పల మహా పడిపూజ

బూర్గంపహాడ్, డిసెంబర్ 7: మండలంలోని తాళ్లగొమ్మూరు సత్యనారాయణస్వామి ఆలయంలో 'మన జిల్లా – మన పడిపూజ' అఖిలభారత అయ్యప్పదీక్ష ప్రచార సమితి, ధర్మజాగరణ సమితి, సాకేతపురి ఆంజనేయస్వామి సేవాసమితిల ఆధ్వర్యంలో అయ్యప్పల మహా పడిపూజ శుక్రవారం రాత్రి నిర్వహించారు. గురుస్వామి రాంబాబు అయ్యప్ప గేయాలను ఆలపించారు. బాచినేని రాంబాబు, సుబ్రమణ్యం, సిలివేరు వీరాంజనేయులు, కిశోర్, నాగభూషణశాస్త్రి, జాదవుల కనకయ్య, సాయిశర్మ, జితేంద్రశర్మ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 7: షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనుచిత వ్యాఖ్యలను, బెదిరింపులను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను మండలంలోని ఎర్రగుంటలో బీఆర్ఎస్ నాయకులు శనివారం దహనం చేశారు. ఆయనపై కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేముల హరీష్, పోల్కంపల్లి శ్రీనివాసరావు, మామిళ్లపల్లి రామారావు, లక్ష్మణరావు, వద్ది వెంకటేష్, కిరణ్, సుధీర్, గోపీనాథ్, అవినాష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు ఎస్సై సస్పెండ్

జూలూరుపాడు, డిసెంబర్ 7: జూలూరుపాడు ఎస్సై రాణాప్రతాప్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాణాప్రతాప్ గతంలో మహబూబాబాద్ జిల్లా గూడూరు ఎస్సైగా పనిచేశారు. అక్కడ ఉన్నప్పుడు, ఓ రోడ్డు ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను కేసు నుంచి తప్పించి, మరొకరిని చేర్చారన్న అభియోగంపై శాఖాపరమైన విచారణ జరిగింది. ఈ అభియోగం నిజమేనని తేలడంతో ఆయనను ఐజీ సస్పెండ్ చేశారు.

సభ్యత్వ రుసుం వసూళ్లపై అభ్యంతరం

రామవరం, డిసెంబర్ 7: ఐఎన్‌టీయూసీ సభ్యత్వ రుసుము కింద తమ వేతనాల నుంచి రెండు నెలలకు రూ.100 చొప్పున కోత విధించడంపై పీవీకే 5 ఇంక్లైన్ ఉద్యోగులు అభ్యంతరం తెలిపారు. వారు శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏఐటీయూసీ నాయకుడు వట్టి కొండ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి భక్తుల వితరణ

భద్రాచలం, డిసెంబర్ 7 : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో అన్నదానం కోసం ప్రకాశం జిల్లా బాలవెంకటాపురానికి చెందిన బోయల కోనరెడ్డి, వెంకటరత్నమ్మ దంపతులు రూ.లక్ష, హైదరాబాద్‌కు చెందిన పి.అజయ్‌కుమార్, విజయలక్ష్మి దంపతులు రూ.లక్ష ఆలయ అధికారులకు అందజేశారు.

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

భద్రాచలం, డిసెంబర్ 7: భద్రాచలంలో ఈ నెల 9న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు తెలిపారు. సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ కార్యాలయంలో వరంగల్ మ్యాక్స్‌విజన్ ఐ ఆసుపత్రి నిర్వాహకులతో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

జడ్పీ సీఈవోగా నాగలక్ష్మి

బాధ్యతలు స్వీకరిస్తున్న నాగలక్ష్మి

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో)గా బి.నాగలక్ష్మి శనివారం జడ్పీ కార్యాలయంలోని చాంబర్‌లో విధుల్లో చేరారు. ఆమెకు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

వరి ధాన్యం కేంద్రాల పరిశీలన

జూలూరుపాడు, డిసెంబర్ 7: మండంలోని కాకర్ల, జూలూరుపాడు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ శనివారం పరిశీలించారు. గోనె బస్తాలు చినిగినవి వస్తున్నాయని సహకార సంఘం అధ్యక్షుడు చీమలపాటి భిక్షం ఫిర్యాదు చేశారు. కొత్త బస్తాలను ఇస్తామని అడిషనల్ కలెక్టర్ చెప్పారు. తహసీల్దార్ స్వాతి బిందు, సహకార సంఘం సీఈవో రమణారెడ్డి, ఆర్